క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజా కార్యక్రమంలో భక్తులు

తలకొండపల్లి: మండల పరిధి రాంపూర్‌లో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకం, వేద పారాయణం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పవన్ కుమార్ రెడ్డి, ఈఓ స్నేహలత, వైస్ చైర్మన్ అమృత, ఆలయ కమిటీ డైరెక్టర్లు స్వామి గౌడ్, వెంకటయ్య, యాదయ్య, నరసింహాచారి, హరిమోహన్ రెడ్డి, రాజ శేఖర్, ఎండోమెంట్ ఆఫీసర్లు, భక్తులు పాల్గొన్నారు.

మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి



నిరసన వ్యక్తంచేస్తున్న జర్నలిస్టులు

తలకొండపల్లి: జర్నలిస్టులపై దాడికి పాల్పడిన నటుడు మోహన్‌బాబుపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని పాత్రికేయులు డిమాండ్ చేశారు. దాడిని ఖండిస్తూ.. గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విలేకరులు విష్ణువర్ధన్, చంద్రకుమార్, వెంకట్‌రెడ్డి, శంకర్, తిరుపతి, గణేశ్, కరుణాకర్, చంద్రకుమార్, శేఖర్, మార్కెట్ డైరెక్టర్ అజీం, మాజీ సర్పంచ్ లలిత, జ్యోతయ్య, సురేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవే లయన్స్‌క్లబ్ లక్ష్యం



అన్నదాన శిబిరం ప్రారంభించిన క్లబ్ సభ్యులు

కడ్తాల్: సమాజ సేవ, పేద ప్రజల ఆకలి తీర్చడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని లయన్ డిస్ట్రిక్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం ప్రధాన కూడలిలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో వీల్స్ ఆన్ మీల్స్ అన్నదాన శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్ మాజీ గవర్నర్ రమేశ్‌బాబు, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, క్లబ్ సభ్యులు రాజేందర్ యాదవ్, వేణుగోపాల్, చేగూరి వెంకటేశ్, పిప్పల వెంకటేశ్, తరుణ్ కుమార్, శ్రీను, లక్ష్మయ్య, పీఆర్‌ఓ పాషా తదితరులు ఉన్నారు.

చలో ఇందిరా పార్కుకు తరలిన అంగన్‌వాడీలు



తరలివెళ్తున్న అంగన్‌వాడీలు

కందుకూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన చలో ఇందిరా పార్కు కార్యక్రమానికి గురువారం మండలం నుంచి అంగన్‌వాడీ టీచర్లు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ కందుకూరు, మహేశ్వరం కన్వీనర్లు బుట్టి బాల్‌రాజ్, ఏర్పుల శేఖర్ మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.18వేల వేతనం పెంచడంతో పాటు.. క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

షాద్‌నగర్: సీసీఐ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అన్ని స్పిన్నింగ్ మిల్లులు పత్తితో నిండిపోయినందున శుక్రవారం పత్తి కొనుగోళ్లు జరగవని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని విక్రయించేందుకు తీసుకురావొద్దని కోరారు. శని, ఆదివారం సెలవు రోజులు కావడంతో రైతులు ఈ నెల 16వ తేదీ సోమవారం పత్తిని తీసుకురావాలని సూచించారు.

పల్లెల్లో ఎన్నికల సందడి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో రాజకీయ వేడి మొదలయింది. ఫిబ్రవరిలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రభుత్వ ప్రకటనతో ఆశావహుల్లో సందడి నెలకొంది. రిజర్వేషన్లు ఎలా ఉన్నా.. ఏర్పాట్లు ముమ్మరం చేసుకుంటున్నారు. ప్రజలతో మమేకం అవుతున్నారు.

- జనవరి 31తో ముగిసిన సర్పంచుల పదవీకాలం
- ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు.. ఆశావహుల్లో జోష్
- రిజర్వేషన్లపై సందిగ్ధం.. అయినా ఏర్పాట్లపై దృష్టి



చర్లపటేల్‌గూడ గ్రామపంచాయతీ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: పల్లెల్లో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభమయింది. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు ముగియగా.. పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 2019 జనవరి 25న స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించగా.. ఫిబ్రవరి 2న సర్పంచులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి 31తో వారి పదవీకాలం ముగిసింది. అనంతరం పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అందురూ భావించారు. కానీ.. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన ఏర్పాటు చేయడంతో ఉత్సాహకుల్లో నిరుత్సాహంగా నెలకొంది. ఇదిలా ఉండగా.. సమగ్ర కుటుంబ కులగణన సర్వే పూర్తి అయిన అనంతరం 2025 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించడంతో పోటీదారులు ఎదురు చూస్తున్నప్పటికీ.. ఎన్నికలు ప్రభుత్వం నిర్వహిస్తుందా! మరోసారి వాయిదా వేస్తుందా అనే చర్చలు జోరుగా జరుగుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే ఓటర్ల తుది జాబితా సిద్ధం చేసింది. పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ ముమ్మరం చేసింది. కేంద్రాల ఏర్పాటులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపండని ఎంపీడీఓలు రాజకీయ పక్ష నేతలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

రిజర్వేషన్లపై తర్జనభర్జన

బీఆర్‌ఎస్ హయాంలో 2018లో తీసుకొచ్చిన పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 2019లో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. అప్పుడున్న రిజర్వేషన్ల వరుసగా మూడుసార్లు ఉంటాయని అప్పట్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం.. స్థానిక ఎన్నికల అంశంపై కాలయాపన చేస్తుండటంతో ఎన్నికల నిర్వహణపై నీలి నీడలు కమ్ముకున్నాయి. లోక్‌సభ ఎన్నికల అనంతరం జూన్‌లో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అంతా భావించారు. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. దింతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. తాజాగా కులగణన అనంతరం బీసీ రిజర్వేషన్లపై ఓ నిర్ణయం తీసుకొని, ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇటీవల స్పష్టం చేసింది. దింతో రిజర్వేషన్లు ఏవిధంగా ఉండబోతాయోన్న తర్జనభర్జన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ రిజర్వేషన్లు ఎలా ఉన్నా.. పట్టు సడలకుండా తమ అనుయాయులను పోటీల్లో దింపేందుకు బడా నాయకులు సిద్ధంగా ఉన్నారు. జిల్లాలో 560 గ్రామపంచాయతీలు ఉండగా.. కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుతో కొన్ని గ్రామాలు తగ్గే అవకాశం ఉంది. కొత్తగా గ్రామాలను ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదు. గ్రామాల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అంచనా వేసుకొని తమకే రిజర్వేషన్ల వస్తాయన్న ఆశలో ఆశావహులు ఎదురుచూస్తుండటం గమనార్హం

పల్లెబాటలో నేతలు

నగరంలో స్థిరపడిన వివిధ పార్టీలకు చెందిన బడా నాయకులు, ఉత్సాహకులు గ్రామాల బాట పడుతున్నారు. వారానికి రెండు మూడు రోజులు పల్లెల్లో ఉంటూ.. ప్రజలకు చేరువవుతున్నారు. పార్టీలకు అతీతంగా పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఇతర పార్టీల్లో ఉన్న కార్యకర్తలు, నాయకులతో సన్నిహితంగా మెలుగుతున్నారు. దావత్‌లతో సందడి చేస్తున్నారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధం

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

యాచారం: స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అఖిల పక్ష నేతలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, సౌకర్యాలు తదితర అంశాలపై నాయకులతో మాట్లాడారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి శ్రీలత, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ఉంటా..

మార్కెట్ చైర్ పర్సన్ గీత



చైర్‌పర్సన్ గీతను సన్మానిస్తున్న ముదిరాజ్ నాయకులు

తలకొండపల్లి: ముదిరాజ్‌లకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆమనగల్లు మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత అన్నారు. వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గురువారం మండల కేంద్రంలో చైర్‌పర్సన్ దంపతులను ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజ్యాధికారంతోనే ముదిరాజ్‌ల బతుకులు బాగు పడతాయని, అందుకు సమష్టిగా పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సుదర్శన్, మాజీ సర్పంచ్ బక్కి కుమార్, బాలయ్య, పాండు, అనిల్, మహేశ్, పాండుప్రసాద్, బాలకిష్టయ్య, చెన్నకిష్టయ్య, యాదయ్య, రాఘవేందర్, రవి కుమార్, నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారురాలికి చెక్కు అందజేస్తున్న నర్సింహారెడ్డి

మీర్‌పేట: ఆపదలో ఉన్న పేద ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి సూచించారు. మీర్‌పేట జిల్లెలగూడకు చెందిన రాసాల మల్లమ్మకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన అందజేశారు. కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిద్దాల దశరథ, బాల్‌రెడ్డి, శ్రీశైలం ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజలో భక్తులు

ఆమనగల్లు: అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా జరిగింది. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో గురువారం కల్లు వినోద్ రెడ్డి స్వామి ఆధ్వర్యంలో పడిపూజను వైభవంగా నిర్వహించారు. గురుస్వామి చంద్రమోహన్ నాయర్ నేతృత్వంలో అయ్యప్పకు పంచామృతాభిషేకం, పూజలు చేశారు. అయ్యప్ప భక్తుల శరణుఘోష మధ్య వినోద్‌రెడ్డి స్వామి పడిని వెలిగించారు. ఈ సందర్భంగా భక్తుల భజనలు, కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి, మాలధారులు రఘు, కిషోర్‌రెడ్డి, వెంకన్న, శ్రీనివాస్, చంద్రారెడ్డి, నిరంజన్, ఎల్లారెడ్డి, మురళీధర్, వంశీ, యాదగిరి, రాజేందర్‌రెడ్డి, యాదయ్య, కృష్ణ, యాదగిరి, స్థానికులు రాము, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధికారులు, నాయకులు

ఆత్మవిశ్వాసం విజయానికి సోపానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు: యువత, విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. పట్టుదల, ఆత్మవిశ్వాసం విజయానికి సోపానమని పేర్కొన్నారు. సీఎం కప్ టోర్నీ ముగింపు సందర్భంగా బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ ఆవరణలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విజేతలకు ఆమె బహుమతులు ప్రదానం చేశారు. లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, పీఈటీలు రిజ్వానా, మహమూద్, ప్రిన్సిపాల్ వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత.. పర్యవేక్షణ లోపం

- పాఠశాల ఆవరణలో పందుల విహారం
- తరగతి గది పక్కనే చెత్తా చెదారం
- పట్టించుకోని అధికారులు



తరగతి గది ఎదుట పందుల విహారం

కొందుర్గు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు, నాయకులు వేదికలపై ప్రసంగాలు చేస్తుంటారు. కానీ అవి సాధ్యం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల మధ్య విద్యాబోధన

జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేసి తరగతి గదిలో ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. ఇదే మండలానికి చెందిన పెద్ద ఎల్కిచర్ల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయుడు చౌదరిగూడ పాఠశాల 2వ తరగతి గదిలో తన మోటార్ సైకిల్ పెట్టి వెళ్తాడు. దీంతో విద్యార్థులు ఫర్నీచర్‌పై కూర్చోవడానికి అనుకూలంగా లేకపోవడంతో నేలపై కూర్చుంటున్నారు. ఈ మోటార్ సైకిల్ ప్రతిరోజు ఇక్కడే పార్కింగ్ చేస్తారని విద్యార్థులు చెబుతున్నారు. ఇదే విషయమై స్థానికులు మండిపడుతున్నారు. అదే విధంగా తరగతి గది పక్కనే పెద్ద మురుగు కాల్వ ప్రవహిస్తోంది. దానికి తోడు తరగతి గది ఎదుట చెత్తాచెదారం వేయటంతో పందులు సంచరిస్తున్నాయి. దీంతో దోమలు, ఈగల బెడద పెరిగి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే పాఠశాల ప్రాంగణంలో ఉన్నత పాఠశాల ఉంది. కాంప్లెక్స్ హెచ్‌ఎం సునిత ప్రతిరోజు ఈ పాఠశాలలోనే విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ విద్యార్థుల సమస్యల గురించి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పక్కనే మండల విద్యాధికారి కార్యాలయం కూడా ఉంది. అయినా పాఠశాల అపరిశుభ్రత, విద్యార్థులు అవస్థలు ఎవరూ గుర్తించకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఓటమి గెలుపునకు పునాది

అపజయానికి కుంగిపోవద్దు

- ఎంపీడీఓ బాలశంకర్
- సీఎం కప్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం
- ముగిసిన క్రీడా పోటీలు



మంచాల: విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంపీడీఓ బాలశంకర్ తదితరులు

మంచాల: నేటి ఓటమి రేపటి గెలుపునకు పునాది అని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. సీఎం కప్–2024 పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో విజేతలకు ఎంపీడీఓ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమితో కుంగి పోవద్దని సూచించారు. అపజయం నుంచి పాఠం నేర్చుకొని, విజయానికి కృషి చేయాలని చెప్పారు. ప్రతిభగల వారిని జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. ఇందులో సూపరింటెండెంట్ ఎండీ మహ్మద్ ఉన్నారు.

మట్టిలో మాణిక్యాలు..

కడ్తాల్: మట్టిలో మాణిక్యాలను వెలికితేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. టోర్నీ ముగింపులో విజేతలకు పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ సుజాతలతో కలిసి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, పీడీ భీముడు, హెచ్‌ఎం జంగయ్య, ఉపాధ్యాయులు రాధాకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో..

తలకొండపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి అన్నారు. విద్యతోనే భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. టోర్నీ ముగింపు సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇందులో మార్కెట్ డైరెక్టర్ అజీం, హెచ్‌ఎం ఝాన్సిలక్ష్మి, మాజీ సర్పంచ్ లలిత, మాజీ ఉప సర్పంచ్ అనిల్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, పీడీలు పాండు, రాధ, పీఈటీ సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచే..

యాచారం: గ్రామ స్థాయి నుంచే మేటి క్రీడాకారులు పుట్టుకొస్తారని సీఐ నర్సింహారావు అన్నారు.



తలకొండపల్లిలో..

ఆసక్తి కలిగిన రంగాల్లో రాణించాలని సూచించారు. సీఎం కప్ టోర్నీ ముగింపులో ఆయన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులంతా నాడు గ్రామీణస్థాయి నుంచే వచ్చారని తెలిపారు. ఎస్‌ఐ మధు, ఎంఈఓ వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు చెల్లించాలి

- టీఎస్‌యూటీఎఫ్ నాయకుల డిమాండ్
- సంఘం మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కడ్తాల్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడ్తాల్: ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయి బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో సంఘం జిల్లా 6వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో బకాయి బిల్లులు ఈ– కుబేర్‌లో జమచేశారని, నాటి నుంచి అవి అక్కడే మూలుగుతున్నాయని పేర్కొన్నారు. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 2023 జులై నుంచి పీఆర్సీని అమలు చేయాల్సి ఉన్నా, దాని జాడే లేకుండా పోయిందన్నారు. 317 జీఓ లోపాలను సవరించి, స్థానికతకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. పేద పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14, 15 తేదీల్లో షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో మహాసభ నిర్వహించనున్నామని, ఇందులో విద్యా వ్యవస్థ పటిష్టత తదితర తీర్మానాలను చేయనున్నామని వెల్లడించారు. సభకు ఉపాధ్యాయులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జంగయ్య, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు, సంఘం నాయకులు మల్లయ్య, కౌసల్య, సత్యనారాయణ, నర్సింహమూర్తి, రాజు ఉన్నారు.

మంచాలలో..

మంచాల: షాద్‌నగర్ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించే మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు అజ్మత్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల పరిధి ఆరుట్లలో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు తుల్జారాం, వెంకట నర్సయ్య, మోతిలాల్, పాపిరెడ్డి, రవికాంత్‌రెడ్డి, సుమలత, గీత, ఉదయ చరణ్ పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: షాద్‌నగర్‌లో నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రాములయ్య కోరారు. ఈ మేరకు కర పత్రాన్ని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సి లక్ష్మీ, సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు విష్ణుమూర్తి, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, రవి, రియాజ్, సర్వేశ్వర్ రెడ్డి, విజయశ్రీ రాణి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం రూరల్: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆజాద్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల పరిధి నాగన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సింహ, జగన్, రవి తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ గౌతం కుమార్

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజలు ముఖ్యంగా యువకులు కృషి చేయాలని మొయినాబాద్ తహసీల్దార్, అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి గౌతం కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్‌లోని అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి జమిల్ రహమాన్ గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడూ తెలుసుకోవాలన్నారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జమిల్ రహమాన్, పంచాయతీ కారోబార్ శ్రావణ్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ మాడి మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాయకులు మంగలి రాములు, కొత్త జైపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ కృష్ణయ్యకు సన్మానం



ఆర్.కృష్ణయ్యను సత్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఏపీ నుంచి బీజేపీ రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా గురువారం షాద్‌నగర్ బీసీ సేన నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్యయాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కృష్ణయ్య నివాసంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల ప్రశాంత్, నాయకులు నరేశ్, నర్సింహాచారి, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు, రాఘవేందర్‌చారి, రాంచందర్, కుమ్మరి కృష్ణ, రాముచారి, రాకేశ్, తేజ, శివకుమార్, గిరి, రమేశ్, శ్రీను, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.